క్లుప్తంగా

అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మంచాల: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. మండల పరిధి నోముల గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో డీఎంఎఫ్ నిధులు రూ.8 లక్షలతో శనివారం అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్, మల్లేశ్, భాస్కర్, జంగయ్య, వెంకటేశ్ గౌడ్, రాజేష్, కృష్ణ, హరీశ్, జయపాల్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



హోమం చేస్తున్న నిర్వాహకులు

మాడ్గుల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కోల్కులపల్లి మాజీ సర్పంచ్ బట్టు అనురాధ అన్నారు. శనివారం మండల పరిధి రాజీవ్‌నగర్ తండాలో రెండో రోజు తుల్జా భవానీ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని తొలగించండి



పురాతన భవనం

అబ్దుల్లాపూర్‌మెట్: శిథిలావస్థ దేవాలయ కమిటీ భవనాన్ని తొలగించాలని బాటసింగారం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. నివాసాల మధ్య ఉన్న భవనం పూర్తిగా విషసర్పాలకు ఆవాసంగా మారిందని వాపోతున్నారు. ఆలయ కమిటీ, పంచాయతీ అధికారులు స్పందించి భవనాన్ని కూల్చివేయాలని కోరుతున్నారు. లేని పక్షంలో కనీస మరమ్మతులు చేయించాలన్నారు.

అనుమతి లేని డ్రైనేజీల మూసివేత



డ్రైనేజీ లైన్ మూసివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తుర్కయంజాల్: యూజీడీ అనుమతులు ఇచ్చేంత వరకు.. ఇంటి ఆవరణలో సెప్టిక్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం పురపాలక సంఘం పరిధి తుర్కయంజాల్ టీచర్స్ గిల్డ్ కాలనీలో డ్రైనేజీ నిండి దుర్వాసన వస్తుందనే ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ సిబ్బంది పరిశీలించారు. అనంతరం అనమతి లేని కనెక్షన్లను మూసివేయించామని ఆయన తెలిపారు. పర్మిషన్ లేకుండా డ్రైనేజీ ఔట్‌లెట్‌లకు కలిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్


మాడ్గుల: మండలంలోని అవురుపల్లి గ్రామ శివారు నుంచి శనివారం ఉదయం అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వాహనాన్ని ఆపగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి, అమీర్‌పేట్ సీతారామాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజా కార్యక్రమాలు చేశారు.

చెరువులకు జలకళ

- కనువిందు చేస్తున్న మత్తళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



రావిర్యాల చెరువు

తుక్కుగూడ: నిన్నమొన్నటి వరకు కురిసిన వర్షాలతో చెరువులకు జలకళ సంతరించుకుంది. పురపాలక సంఘం పరిధి మంఖాల్ చెరువు, తుక్కుగూడ సూరం చెరువు, రావిర్యాల పెద్ద చెరువు నిండుకుండలా కనవిందు చేస్తున్నాయి. 30 ఏళ్ల చరిత్రలో ఎరుగని రీతిలో అడుగంటిన చెరువులు కాస్త.. 2020 అక్టోబర్‌లో కురిసిన కుండపోత వర్షాలకు అవన్నీ నిండిన విషయం తెలిసిందే. ఇక నాటి నుంచి కురుస్తున్న వర్షాలతో చుక్కనీరు తగ్గలేదు.

గొలుసుకట్టు..


పుర పరిధి బాగ్ మంఖాల్ చెరువు నిండితే.. పులిందర్ వాగు నుంచి నీరు రావిర్యాల చెరువులోకి, సూరం చెరువు నిండితే కాల్వల ద్వారా బొమ్మల కుంట నుంచి పులిందర్ వాగులో కలిసి రావిర్యాల చెరువులోకి నీరు వస్తుంది. జిల్లాలోనే అతి పెద్ద చెరువులో రావిర్యాల చెరువు ఒక్కటి. ఈ చెరువును 16వ శతాబ్దంలో నిజాం పాలకులు నిర్మించారు. 1.5 టీఎంసీ నీరు నిల్వ ఉండే సామర్థ్యం కలిగిన చెరువు ఇది. ఈ చెరువు కింద రావిర్యాల, ఆదిబట్ల తదితర ప్రాంతాల రైతులు ఒకప్పుడు వందల ఎకరాల భూమిని సాగు చేసే వారు.

కబ్జాకు గురైన కాల్వలు

బాగ్ మంఖాల్ నుంచి రావిర్యాల చెరువులోకి నీరు వచ్చే పులిందర్ వాగు, సూరం చెరువు నుంచి బొమ్మలకుంట నీరు వచ్చే కాల్వలను పూర్తిగా రియల్టర్లు కబ్జా చేసి, ధ్వంసం చేశారు. ఇదే విషయమై స్థానికులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

నీటమునిగిన పంటలు

తుక్కుగూడ సూరం చెరువు, రావిర్యాల చెరువులు నెల రోజులుగా అలుగు పోస్తున్నాయి. రావిర్యాల చెరువు 40 ఏళ్ల అనంతరం మత్తడి దుంకుతోందని స్థానికులు తెలిపారు. చెరువు నిండుకుండలా మారడంతో చాలా మంది రైతుల పంటపొలాలు నీట మునిగాయి. చెరువు నుంచి తూముల ద్వారా నీరు వెలుపలకు పంపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వారి విజ్ఞప్తి మేరకు గత నెల 27న ఇరిగేషన్ అధికారులు.. రావిర్యాల చెరువును సందర్శించారు. నీట మునిగిన పొలాలను పరిశీలించి, రైతులు నుంచి వివరాలను సేకరించారు.



దిగువకు పారుతున్న జలపాతం

కుట్రతోనే రిజర్వేషన్లకు అడ్డుకట్ట

- మాటకు కట్టుబడిన ప్రభుత్వం..
- పరిస్థితులు ఎలా ఉన్నా.. బీసీలకు న్యాయం చేస్తాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: కుట్రా రాజకీయాలతో కొందరు కోర్టుకు వెళ్లి, రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని, పరిస్థితులు ఎలా ఉన్నా.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరుతామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం మాది అన్నారు. నగరంలోని తన నివాసంలో మండల పరిధి పోలెపల్లి పాపర్ల బోడుతండాకు చెందిన బీజేపీ నాయకులు రాజు, కుమార్, గోపి తదితరులు శనివారం అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్, బీజేపీలు కుట్రా రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజాపాలనను చూసి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీ కులగణన చేసిందని, తద్వారా రిజర్వేషన్లు కల్పించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు అనంతరెడ్డి, నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, మాజీ సర్పంచ్‌లు వెంకటరమణారెడ్డి, బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కసిరెడ్డి

జోనల్‌స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జోనల్‌స్థాయి క్రీడల్లో ఆమనగల్లు ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. టోర్నీలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్ విభాగంలో సత్తాచాటిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. వాలీబాల్‌లో అండర్ 14 విభాగంలో పట్టణ విద్యార్థులు రెండో బహుమతి గెలుచుకున్నారు. అండర్ 17లో రినాల్స, తపస్య, స్వాతి, అండర్ 14లో అనుశ్రీ, శ్రీలత, సోని, కబడ్డీలో మానస, మనీషలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మహమూద్ తెలిపారు.

31 పోలియో కేంద్రాల ఏర్పాటు

ఆమనగల్లు: నేడు నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని వైద్యాధికారి డాక్టర్ మైమునాబేగం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో మొత్తం 31 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 3,445 మంది ఉన్నారని, చుక్కల మందు పంపిణీకి 134 మంది సిబ్బందిని నియమించామని తెలిపారు. నేడు పిల్లలకు చుక్కల మందు వేస్తామని, మిగిలిన వారికి ఈ నెల 13,14 తేదీలలో ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

ఆమనగల్లు: బీసీలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఒగ్గు ప్రభాకర్ ఒక ప్రకటనలో శనివారం ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లు అంటూ చెల్లని జీఓ 9 జారీ చేసిందని విమర్శించారు. రిజర్వేషన్లు కల్పించక పోతే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

నేడు బొడ్రాయికి బోనాలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలో బొడ్రాయి 3వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బోనాల పండుగ నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ఆర్వోప్లాంట్ ఏర్పాటు



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ మేయర్

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ప్రభుత్వ పాలిటెక్నిట్ కళాశాలకు శనివారం మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు తమ సొంత నిధులతో ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ విద్యార్థులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకువావడంతో సొంత నిధులతో ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేశబూమని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంతో శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ బంగారు బాబు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

సాగులో నూతన పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మంచాల: పంటల సాగులో రైతులు నూతన పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త మహేందర్ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన రైతులకు ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజేందర్‌నగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. అనంతరం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ.. సుస్థిర వరి ఉత్పత్తికి నేరుగా వరి విత్తన విధానంపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సాంప్రదాయ పద్ధతి వరి నాటుతో అధిక ఖర్చు, నీటి వినియోగం, మిథేన్ వాయువు వలన పర్యావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు. నేరుగా విత్తే విధానం ద్వారా తక్కువ నీటి వినియోగం, ఎకరా వరి సాగుకు రూ.5 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. సాంప్రదాయ విధానంతో పోలిస్తే.. దీనితో లాభదాయకమన్నారు. మట్టి పరీక్ష కిట్లు, విత్తనాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్, కవిరాజు, అజయ్, సాయికిరణ్, శ్రీకాంత్, రైతులు నర్సింహ, బాలరాజు, కృష్ణ, బాబయ్య, భిక్షపతి, మహేశ్, రాములు, వినోద్‌కుమార్, మల్లేశ్, దానయ్య, సత్తయ్య, బాషయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఆమనగల్లు: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలని తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఫ్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిననాటి నుంచే పట్టుదల, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. యుక్త వయసులో దురలవాట్లకు లోనుకాకుండా.. విద్యనభ్యసించి ఉన్నతంగా రాణించాలని చెప్పారు. అనంతరం కళాశాలకు రూ.5 లక్షల విలువైన మెటీరియల్ బహూకరించిన ఉన్నతి, శిక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుధాకర్‌రెడ్డి, ఎన్ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అంజయ్య, మాజీ సర్పంచ్‌లు జోతయ్య, రఘుపతి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, కళాశాల సిబ్బంది కృష్ణకాంత్, షణ్ముకరెడ్డి, సాయి రణీష, విజయ్‌కుమార్, సంతోష్‌కుమార్, పరమేశ్, వెంకన్న, పద్మ, గార్గేయి, యాదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ న్యాయవాదిని అరెస్ట్ చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడ్తాల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్.గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఘటనకు నిరసనగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమితి మండల అధ్యక్షుడు అబ్బు రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. దాడి కుట్ర వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. నిరసనగా.. సమితి పిలుపు మేరకు ఈ నెల 13న చలో కలెక్టరేట్, 17న మండల కార్యాలయాల ముట్టడి, 22న చలో హైదరాబాద్ చేపట్టనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, లక్ష్మయ్య, నర్సింహ, రాఘవేందర్, వెంకటేశ్, అంజి, సురేశ్, కృష్ణ, హరికృష్ణ, వీర రాఘవులు, నరేందర్, వీరేశ్, కుమార్, శ్రీశైలం, కుమార్, శివరాజు తదితరులు ఉన్నారు.

అదనపు బస్సులు నడపాలని వినతి

బడంగ్‌పేట్: బాలాపూర్ గ్రామానికి అదనపు బస్సులు నడపాలని కోరుతూ.. శనివారం మిధాని డిపో మేనేజర్‌కు బాలాపూర్ వాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో మిధాని డిపో నుంచి రోజుకు 5 నుంచి 6 బస్సులు నడిచేవని,. ఇప్పుడు ఒక్కటే నడుస్తోందన్నారు. 102ఎం బస్ బాలాపూర్ నుంచి కోఠికి తిరిగి కోఠి నుంచి బాలాపూర్ వచ్చేసరికి రెండు గంటలకు పైగా సమయం తీసుకుంటుందన్నారు. రేవంత్ సర్కారు ఉచిత బస్ సౌకర్యం ఇచ్చిన బాలాపూర్ వాసులకు అందని ద్రాక్షగానే మిగిలిపోయిందన్నారు. దయచేసి మరోమారు విచారణ చేసి బాలాపూర్‌కు రద్దు అయిన బస్సులను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, కార్యగారి శ్రీధర్, కప్పాటి ఆంజనేయులు, సురేందర్, రవి, బొర్ర రమేశ్, మహేందర్ తదితరులు ఉన్నారు.

బీజేపీవి ఆధిపత్య రాజకీయాలు

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి
- ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: బీజేపీకి అనుబంధ సంస్థలా కేంద్ర ఎన్నికల సంఘం పనిచేస్తోందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ఏఐసీసీ ఇన్‌చార్జి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ ఓటు చోరికి అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 5 కోట్ల సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఓట్ల చోరిని వ్యతిరేకిస్తూ.. మండల కేంద్రంలో శనివారం సంతకాల సేకరణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థ స్వయం పాలన, స్వీయ నిర్ణయాధికారం కాపాడటానికే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఇది 15వ తేదీ వరకు కొనసాగుతుందని, అనంతరం కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించనున్నామని పేర్కొన్నారు. బీజేపీ ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని, ఓటు చోరి ద్వారా దేశంలో ఆధిపత్య రాజకీయాలు కొనసాగిస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో సాగిస్తున్న పోరాటంలో ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా దేశ వ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల నియామకం పారదర్శకంగా చేపట్టనున్నామని, అది ఈ నెల చివరి వరకు పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, వెంకటేశ్, మహేశ్, యాదయ్యగౌడ్, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ బాలికల దినోత్సవం



కడ్తాల్: కేక్‌కట్ చేస్తున్న విద్యార్థినులు

కడ్తాల్: అంతర్జాతీయ బాలికల దినోత్సవం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్‌లు పాల్గొని, బాలికల చేత కేక్‌కట్ చేయించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బాలికల విద్య, వైద్య సేవలు, పోషణ, రక్షణ తదితర హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదిబట్లలో..



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో..

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్జాతీయ బాలికల దినోత్సవం శనివారం ఆదిబట్ల ప్రాథమి పాఠశాలలో ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు పరమేష్ ఆధ్వర్యంలో చదువులో అత్యున్నత ప్రతిభ చూపిన బాలికలకు దాతల సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- సీడీపీఓ వినితాదేవి

ఇబ్రహీంపట్నం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీఓ వినితాదేవి అన్నారు. జాతీయ పోషణ మాసంను పురస్కరించుకొని మహిళా సమాఖ్య భాగస్వామ్యంతో శనివారం పట్నంలో సామూహిక అన్నప్రాసన, సీమంతాలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందజేసి మాట్లాడారు. నిర్లక్ష్యం చేయకుండా.. గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ ఎదుగుదలకు సంబంధించి ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలని మహిళలకు సూచించారు. పిల్లల్లో ఊబకాయం సమస్య ఎక్కువగా ఉంటుందని, చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ నెల 16 వరకు గ్రామగ్రామాన ఆహార అలవాట్లపై గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అంగన్‌వాడీ, హెల్త్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డాక్టర్లు కార్తీక, విజేందర్లు మాట్లాడుతూ.. పాలిచ్చే తల్లులు సరైన ఆహారం తీసుకోవాలని, అప్పుడే శిశువుల ఎదుగుదల సరైన పద్ధతిలో ఉంటుందన్నారు. కిశోర బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందని, ఇందుకు సరైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ పల్లవి, మణెమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: సామూహిక సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కడ్తాల్‌లో..

కడ్తాల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గోవిందాయిపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవనశైలికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు, చిన్నారులకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది